ప్రజాశక్తి
మంగళవారం 16 మే 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు

మండే ఎండ

- భారీగా పెరిగిన వడగాల్పులు
- వేసవి తీవ్రతకు అల్లాడుతున్న ప్రజలు
- విద్యుత్ సరఫరాలో అంతరాయంతో అవస్థ

జనసంచారం లేక బోసిపోయిన గుంటూరులోని లక్ష్మీపురం ప్రధాన రహదారి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాలో వడగాల్పులు భారీగా పెరిగాయి. ఎండల తాకిడికి ప్రజలు పగటి సమయంలో ఇళ్ల నుంచి బయటకు రావడానికి హడలెత్తిపోతున్నారు. సోమవారం గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వడగాల్పులు మధ్యాహ్నం మరింత పెరిగాయి. వేడితాకిడికి బయటనుంచి ఇళ్లకు చేరే వారు డీలాపడుతున్నారు. కొంతమంది తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. హెల్మెట్, ముఖానికి ఖర్చీఫ్, టోపీ ధరిస్తున్నారు. చెవులకు, తలకు వస్త్రాలు కట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు.

గతేడాది కంటే ఈ ఏడాది మే మూడో వారంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. పల్నాడు, గుంటూరు జిల్లాల్లో సోమవారం వడగాల్పులు అధికమయ్యాయి. పొన్నూరులో 45.9, నర్సరావుపేటలో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంగళవారమూ గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రెండు జిల్లాల పరిధిలో పలు మండలాల్లో 45 డిగ్రీల నుంచి 48 వరకు నమోదయ్యే అవకాశం ఉంది. ప్రయాణాల్లో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గుంటూరు జిల్లాలో దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, పెదకాకాని, తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు మండలాల్లో తీవ్ర వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

▶ 2లో


ఉప్పలపాడులో కూలీలతో మాట్లాడుతున్న పాశం రామారావు

5లో

ఉపాధి కూలి బకాయిలు రూ. 1.69 కోట్లు వెంటనే చెల్లించాలి

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్
- ఉప్పలపాడులో ఉపాధి పనుల పరిశీలన - 22న గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని పిలుపు

తాడేపల్లి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జొన్న శివశంకరరావు తదితరులు

5లో

క్వింటా పసుపు రూ.10వేల మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

గుంటూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

డెంగీ నివారణ చర్యలు పాటించాలి

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

డెంగీ వ్యాధి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎల్.శివశంకర్ సూచించారు. ఈ మేరకు జాతీయ డెంగీ దినం వాల్‌పోస్టర్లను కలెక్టరేట్లలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్ వైజర్లు అందరు ప్రజలతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే వర్షాకాలంలో వ్యాధి ప్రబలే అవకాశం ఉన్నందున దోమల నివారణకు తీసుకోవలసిన చర్యలు సంపూర్ణంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజలు సైతం తమ ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, నీటిపై మూతలు ఉంచడంతోపాటు వాడేసిన కొబ్బరి బోండాలు, ఖాళీ పాత్రలు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని సూచించారు. డిఎం అడ్ హెచ్‌ఒలు డాక్టర్

▶ 2లో

నరసరావుపేటలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్

లింగ నిర్ధారణ చట్టాన్ని మీరితే చర్యలు

ప్రజాశక్తి-నరసరావుపేట

స్కాన్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ చట్టం 1994 పరిధిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సరావుపేట ఆర్‌డిఒ

▶ 2లో

సమావేశంలో ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి, డాక్టర్ గీతాంజలి

ఇంటర్ సప్లిమెంటరీకి పటిష్ట ఏర్పాట్లు

అధికారులతో గుంటూరు జిల్లా కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో మే 24వ తేదీ నుంచి జూన్ 01వ తేది వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు పటిష్టంగా తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలకు హజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలతోపాటు, అధిక ఉష్ణోగ్రత కారణంగా తాగునీరు, మజ్జిగ, ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అవసరం మేరకు ఓఆర్‌ఎస్, మెడికల్ కిట్లతోపాటు మెడికల్ సిబ్బందిని వైద్యారోగ్యశాఖ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఆర్‌ఐఒ జి.సునీత మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ద్వితియ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయన్నారు. 54 పరీక్ష కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 21725 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6424 మంది హాజరు అవుతున్నారని తెలిపారు. సమావేశంలో జెసి రాజకుమారి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ లలితా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల ఆందోళనపై ప్రధాని స్పందించాలి

- ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవాలి
- ఐద్వా రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - నరసరావుపేట

క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశ కీర్తినిని పెంచుతున్న మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని మహిళా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా సోమవారం పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడిన ఎంపీపై చర్యలు తీసుకోకుంటే బిజెపికి కర్ణాటకలో పట్టిన గతే

▶ 2లో

రౌండ్‌టేబుల్ సమావేశంలో మహిళా నాయకులు

మండే ఎండ

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం పొన్నూరులో అత్యధికంగా 45.9, తాడికొండ, గుంటూరులో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దుగ్గిరాల 44.4, కొల్లిపర 44.2, మంగళగిరి 44.1, పెదనందిపాడు 44, తెనాలి 43.7, పెదకాకాని 43.5, కాకుమాను 43, తాడేపల్లి 43.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా అత్యల్పంగా వట్టిచెరుకూరులో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. పల్నాడు జిల్లాలో నర్సరావుపేటలో 45.8, వినుకొండ, దాచేపల్లి 43.8, అచ్చంపేట 43.7, అమరావతి 43.6 ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు జిల్లాలో మంగళవారం అత్యధికంగా 45 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశంఉందని, వడగాల్పులు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో వేడిగాలులుతీవ్రంగా ఉంటాయని తెలిపారు. పట్టణ ప్రాంతాలే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా వీధుల్లో పగటి పూట జనసంచారం తగ్గింది. వేసవి తీవ్రతతో మళ్లీ విద్యుత్ వినియోగం పెరగడం, విద్యుత్ పరికరాలు దెబ్బతిని పలు మార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని అధికార వర్గాలు తెలిపాయి. వేడిగాలులు తీవ్రతకు పిల్లలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని మీరితే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఎం.శేషిరెడ్డి హెచ్చరించారు. పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పై ఉప జిల్లా సాయి నర్సరావుపేట మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ, ఉప జిల్లాస్థాయి స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక డేకాయ ఆపరేషన్లు నిర్వహించాలని, అనుమతి లేని వాటిని గుర్తించాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఒక ప్రణాళిక రూపొందించాలని, లింగ నిర్ధారణ చట్టం సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్. బి.గీతాంజలి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, కన్వీ నర్ డాక్టర్ వసంతకిరణ్, కె.సాంబశివరావు, మహిళా సం ఘం నాయకులు డి.శివకుమారి, షేక్ ఖాజావలి పాల్గొన్నారు.

డెంగీ నివారణ చర్యలు పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)

శ్రావణ్‌బాబు, డాక్టర్ జి.శోభారాణి మాట్లాడుతూ 16న మంగళవారం జరగబోవు జాతీయ డెంగీ దినోత్సవాన్ని జిల్లా అంతటా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, కరపత్రాలు, గోడ పత్రికలు పంపిణీ చేయుచున్నామని తెలిపారు. గుంటూరులో జెసి జి.రాజకుమారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సుబ్బరాయణం డిఆర్ఒ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత పాల్గొనగా నరసరావుపేటలో జెసి ఎ.శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం జిల్లా మలేరియా అధికారి రత్నాకర్ పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల ఆందోళనపై ప్రధాని స్పందించాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా పడుతుందన్నారు. తమపై వేధింపులకు నిరసనగా, ఎంపిపై చర్యల కోసం రెజ్లర్లు దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోపోవడం దారుణమన్నారు. ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజిని మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటిన మహిళా రెజ్లర్లపైనా వేధింపులు సిగ్గుమలిన చర్యన్నారు. రెండు వారాలుగా న్యాయం కోసం పోరాటం చేస్తున్నా మోడీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రధాని మోడీ స్పందించాలని, వాస్తవ సమస్యలపై దృష్టిపెట్టి రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాగమ్మ భాయ్, ఫాతిమా, ఎం.సువార్త, జి.సీత, సాయికుమారి, పద్మ పాల్గొన్నారు.

పూర్తయిన లేఅవుట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పల్నాడు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై అధికారులతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, అందుతున్న సేవలపై కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్ లో కలెక్టర్ శివ శంకర్ అధ్యక్షతన జిల్లా అధికారు లతో సోమవారం జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ తో పాటు జాయింట్ కలె క్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కూడా పాల్గొన్నారు. గృహ నిర్మాణం (జగనన్న పేదలందరికీ ఇళ్ల పథకం) పథకం), జగనన్న స్వచ్ఛ సంకల్పం ,పంచాయతీలలో లేబర్ మొబిలైజేషన్, శాశ్వత భూ హక్కు,భూ రక్ష పథకం, అకాల వర్షాలకు పంట నష్ట పరిహారం పంపిణీ, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఎండాకాలంలో వేసవి చలి వేంద్రాల ఏర్పాటు, పర్యావరణ హిత కార్యక్రమాలు వంటి అంశాలపై జిల్లా మండల, జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గృహనిర్మాణ పథకంలో ఇప్పటి వరకు పూర్తి అయిన లేఅవుట్ లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు ఎం.పి.డి.ఓ, ఎం.ఆర్.ఓ, వెలుగు ఎ.పి.ఎం, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎ.ఇ, విద్యుత్తు ఎ.ఇ., హౌసిం గ్ ఎ.ఇ లు ఫీల్డ్ విజిట్ చేయాలని, తహ శీల్దార్లు త్వరితగతిన పొజిషన్ సర్టిఫికట్లు ఇవ్వాలని, పంచాయతీల్లో లేబర్ మొబి లైజేషన్ చేయాలని, చెత్త నుంచి సంపద సం పద తయారీకేంద్రాలలో క్లాప్ మిత్రాలు యాప్‌లో అప్ లోడ్ చేయాలని ఆదే శించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా జరుగుతున్న సర్వే పను ల్లో బుధవారం నాటికి సరిహద్దు రాళ్ళు నాట డం పూర్తి చేయాలని అన్నారు.

ఎండలు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేయాలని, ప్రజలకు వడ దెబ్బ తగల కుండా జాగ్రత్తలు సూచించాలని పేర్కొ న్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి పర్యావరణ హిత కార్యక్రమాలు, పర్యా వర ణానికి మేలు చేకూర్చే విధంగా ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా రీ ఓపెన్ అయిన కేసులు పెం డింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిటు (పి.ఎ,.ఎఫ్.పి) ప్రతీ మండలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబిషన్ డిక్లరేషన్ పెండింగ్ లో ఉన్నవి పూర్తి చేయాలని, జిల్లాలో నిరుద్యోగ యువ త సర్వే చేపట్టాలని ఆదేశించారు.

యువగళం పాదయాత్రకు సంఘీభావం

తెనాలి, వినుకొండలో పాదయాత్ర చేస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్రాభివృద్ధిని దిగజార్చిన వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు దాటిన నేపథ్యంలో ఆలపాటి సారథ్యంలో సోమవారం పట్టణంలో సంఘీభావ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర లింగరావు కూడలి, రజకచెరువు కూడలి, గాంధీచౌక్, బోస్‌రోడ్ మీదుగా సాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అభివృద్ధికి తిలోదకాలిచ్చింద న్నారు. కేవలం ప్రచారానికి పెద్దపీట వేస్తూ, ప్రజలపై పన్నుల భారం మోపి, సామా న్యుల మనుగడను మరింత కుంగదీసిం దన్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ పాద యాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. **అచ్చంపేట** మండలం వేల్పూరు ఎన్టీఆర్ బొమ్మ వద్ద నుండి క్రోసూరు అంబేద్కర్ విగ్రహం వరకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మల పాటి శ్రీధర్ తన అనుచరులతో కలిసి సాయంత్రం పాదయాత్ర చేశారు. **చిలకలూరిపేట** పట్టణంలో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు. **సత్తెనపల్లి**లో సంఘీభావ పాదయాత్రకు నియోజకవర్గం నలుమూలల నుంచి శ్రేణులు తరలివచ్చారు. **మంగళగిరి**లో పాదయాత్రలో టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడారు. **వినుకొండలో** టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పాదయాత్ర చేశారు.

ప్రకటన

గుంటూరుజిల్లా, పెదనందిపాడు మండలం, గోగులమూడి గ్రామ కాపురస్తుడు కట్టా చంద్రయ్యగారి కుమారుడు కట్టా అంకమ్మరావు ద్వారా సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా :
వారి పెదనాన్న గారైన కట్టా అంకయ్యగారి కుమారుడు రామస్వామిగారు ది.22-04-1981వ సం॥లో డాక్యుమెంట్ నెం.1196/1981గా శ్రీ ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రారు గారి కార్యాలయంలో రిజిష్టర్ కాబడిన విక్రయ దస్తావేజు ద్వారా రావిపాడు శివారు గోగులమూడి పంచాయతీలో గల డి.నెం.233/4 నందు య.0.53 శెంట్లు లేదా 0.21 హెక్టార్లు భూమిని (1) లావు చెంచమ్మ (2) కొత్త నాగవర్ధిని గార్ల నుండి కొనుగోలు చేసికొని ఉన్నారు. తదుపరి ది.23-03-1995లో మరణించినారు. దరిమిలా సదరు రామస్వామి గారి భార్య కట్టా సోమమ్మకు వారసత్వ రీత్యా సంక్రమించబడి సర్వే నెం. 233/4ఎ ఖాతా నెం.36గా నమోదు కాబడినది. తదనంతరం ది.31-05-1999న సోమమ్మగారు మరణించినారు.

సంతానంలేని ఆ భార్యభర్తలు పైన తెలిపిన మా క్లయింటు అనగా కట్టా అంకమ్మరావును ఆశ్రమించి వుండగా వారి జీవితకాలము వారికి సర్వసపర్యయలు చేసినందున సదరు య.0.53 సెంట్లు భూమిని తానే సాగు చేసుకుంటూ గత 24 సం॥ల నుండి సర్వ హక్కులలో అనుభవిస్తున్నారు.

సదరు భూమి విషయమై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలున్నా ఈ ప్రకటనానంతరం వారం రోజులలో శ్రీయుత తహాశీల్దారు, పెదనందిపాడు మండల వారికి ఫిర్యాదు చేయగలరు. లేనియెడల సదరు భూమి మా క్లయింట్ అయిన కట్టా అంకమ్మరావుదిగా తీర్మానించబడును.

యన్.వి.వెంకటసుబ్బారావు,
బి.రామకోటిరెడ్డి,
అడ్వకేట్స్,
సెల్ నె: **6302065600, 7995521796**

Notice
IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE:: GUNTUR
E.P.No.262/2019 in O.S.No.753/2006

Between:
Bandlamudi Basaveswara Rao. ......D.H.R
And
Vallapuri Deepthi ... J.D.R.
To,
Vallapuri Deepthi,D/o.Venkateswara Rao, R/o.13 th ward,C/o.Julakanti Naga Lakshmi, Piduguralla Village & Mandal, Guntur Dist.

పై నెంబరు E.P లో జె.డి.ఆర్.అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:28-06-2023 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:28-06-2023

చాగంటి నరసింహా రెడ్డి,
డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్, గుంటూరు.

Notice
IN THE COURT OF THE HON'BLE II ADDL.DIST. JUDGE:: GUNTUR
M.V.O.P.No:1153/2018

Between:
Vinukonda Lakshmi Kanthamma ... Petitioner
And
D.V.Ramana & Others ... Respondents
To,
R-1: D.V.Ramana ,Prop.Ushodaya Transport, Opp.to KCP Main Gate,Macherla, Guntur Dist. (Owner of Lorry bearing Regd. No:AP 07 W 8284)
R-3: Vallepu Venkata Purnachandra Rao, S/o.Anjaneyulu, R/o.10 th ward ,Macherla, Guntur Dist.
(Driver of the Lorry bearing Regd. No:AP 07 W 8284)

పై నెంబరు O.Pలోని పిటీషనర్ యాక్సిడెంటుకు నష్టపరిహారము కోరుచూ పిటీషన్ దాఖలు చేయగా సదరు O.P. లో 1 & 3 వ రెస్పాండెంట్స్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:13-06-2023 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:13-06-2023

దాస్ పసల,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
గుంటూరు. సెల్:8332948944

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...
ఐ.పి.నెం. 29/2023

పిల్లుట్ల @ ముటుకూరి గోపాలకృష్ణమూర్తి ...పిటిషనర్
మరియు.
1) బత్తుల వీరారెడ్డి.
2) మూరం ఏడుకొండల వెంకటరమణారావు.
3) రావెల లింగయ్య.
4) చంద్ర రవీంద్రబాబు.
5) పెండాల రామలింగేశ్వరరావు.
6) అప్పరాజు వెంకట నారాయణ.
7) అప్పరాజు వల్లి దేవి.

పై నెంబర్ ఐ.పి ని ఇందలి పిటిషనర్ తనకు గల బాకీలను తీర్చలేక తనను ఇన్సాల్వెంట్ గా డిక్లేర్ చేయమని కోరుతూ ఇందలి రెస్పాండెంట్స్ పై దాఖలు చేసుకుని ఉన్నారు.ఇంకనూ ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నచో ది. 14-06-2023న ఉదయం 10:30ని.లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వులతో వాయిదా..
ది. 14-06-2023 **ఇట్లు.**

శ్రీ బి.అనిల్ కుమార్,
పిటిషనర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట. పల్నాడు జిల్లా.

దావా నోటీసు
మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో
ఒ.యస్. నెం:1270 / 2020

బిట్వీన్
తిరువల్లూరి అశోక్ శర్మ . .... వాది
మరియు
తిరువల్లూరి పూర్ణ కృష్ణచారి @ కృష్ణ వగైరాలు .... ప్రతివాదులు
టు,
D-2: తిరువల్లూరి ఉమాదేవి, భర్త.లేటు బెనర్జీన చారి,
D-3: తిరువల్లూరి బాలకోటేశ్వరమ్మ, తండ్రి. లేటు.బెనర్జీన చారి, ఇరువురు నివాసం: పాతరెడ్డిపాలెం గ్రామము, చేబ్రోలు మండలం,గుంటూరు జిల్లా.
D-4: తిరువల్లూరి కుసుమ కుమారి, భర్త. లేటు.సత్య నారాయణ,
D-5: తిరువల్లూరి రామకృష్ణ, తండ్రి. లేటు.సత్య నారాయణ,
D-6: తిరువల్లూరి ధన సుందరమ్మ, తండ్రి. లేటు.సత్య నారాయణ,
D-7: తిరువల్లూరి శివ కుమారి @ శివాని, తండ్రి. లేటు.సత్య నారాయణ, D-4 to D-7 ల నివాసం, డోర్ నెం:9-62A, లైబ్రరీ పోస్టు సెంటర్, పాతరెడ్డిపాలెం గ్రామము, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాని వాది పార్టీషన్ కోరుతూ దాఖలు చేయగా సదరు దావాలో ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది: 04-07-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చుడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:04-07-2023

కొండూరి నంద కిషోర్,
వాది తరపు అడ్వకేట్,
9వ లైను, ఎటి అగ్రహారం, గుంటూరు.
సెల్: 99491 85047

'జగనన్నకు చెబుదాం'కు140 ఫిర్యాదులు

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రజల నుంచి వచ్చే ప్రతీ సమస్యకు అధికారులు తప్పని సరిగా పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి జిల్లా అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా నరసరావు పేట కలెక్టరేట్ కార్యాలయం లో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. పర్యావరణ హిత జీవన శైలి పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండేలా జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. వచ్చే నెల 5 న ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం ఉన్న నేపథ్యంలో పర్యావరణ రక్షణకు కృషి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా నలుమూలల తరలి వచ్చిన ప్రజలు అందించిన సమస్యల అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించి వాటిని సంబంధిత జిల్లా అధికారులకు పంపి సమస్యలు పరిష్కారం చూపాలని ఆదేశించారు. 140 మంది అర్జీదారులు జగనన్నకు చెబుదాం (స్పందన) లో తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సాధ్య మైనంత త్వరగా నియమిత సమయం లోపు సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచనలు జారీ చేశారు. మండల స్థాయిలో వచ్చిన సమస్యలను మండల అధికారులు అక్కడే పరిష్కరిస్తే ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి ఇక్కడిదాకా వచ్చే పరిస్థితి ఉండదన్నారు. జిల్లా అధికారులు ఇటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంలు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి జిల్లా అధికారులకు పంపి, సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన విభాగం నుంచి రెవెన్యూ శాఖ ఎస్.ఓ యశోద, టెక్నికల్ సిబ్బంది, నరసరావు పేట సచివాలయ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. 'జగనన్నకు చెబుదాం' (స్ప%శీ%దన) కు తమ సమస్యలను తెలియ జేసేందుకు వచ్చిన ఫిర్యాది ధారులకు పల్నాడు జిల్లా నరసరావు పేట ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి జిల్లా కమిటి అధ్యక్షులు కొండవీడు హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి తరపున కంజుల కోటి రెడ్డి 250 మందికి ఉచిత భోజన వసతులు కల్పించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్, జెసి శ్యాంప్రసాద్

విఆర్‌ఓ మోసం పై మహిళా రైతు ఫిర్యాదు

16 ఎకరాల పొలాన్ని తన పేరిట వెబ్ ల్యాండ్ లో చేర్చేందుకు విఆర్వో నల్లబోతుల శివ శంకర్ ను సంప్రదించగా రూ 3 లక్షలు డిమాండ్ చేయడంతో అప్పు చేసి ఇచ్చానని అయినప్పటికీ వెబ్ ల్యాండ్ లో నమోదు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నాడని సత్తెనపల్లి నగన్న కుంటకు చెందిన జింకా సీతారాములు ఫిర్యాదు చేశారు. తన మేనత్తకు సంతానం లేకపోవడం తో తనకు చెందిన సత్తెనపల్లి,పిడుగురాళ్ల రోడ్డులో 16 ఎకరాల భూమిని తన పేరిట స్వాధీనం రాసి ఇచ్చారని మేనత్త గన్నే సూర్య లక్ష్మి ఆమె భర్త ఇద్దరు మృతి చెందారని తెలిపింది. 8 నెలల క్రితం దాచేపల్లి బదిలీపై వెళ్లిన విఆర్వో శివ శంకర్ ను అక్కడికి నిలదీయగా డబ్బులు ఇచ్చేది లేదని ఇపుడున్న విఆర్వో కు మళ్ళీ డబ్బులు ఇచ్చి చేయించుకోవాలని అన్నారని చెప్పింది. 'మళ్ళీ డబ్బులు అని వస్తే నీ అంతు చూస్తా 'అంటూ బెదిరింపులకు పాల్పడుతున్న విఆర్వో పై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్టీసీ అధికారులు, లాయరు మోసం

14 ఏళ్ల వాటిల్లిన ఆర్టీసీ బస్సు ప్రమా దంలో రెండు కాళ్ళు కోల్పోయానని అప్పటి నుండి పరిహారం కోసం న్యాయవాదిని పెట్టుకొని తిరుగున్నా న్యాయం జరగలేదని నరసరావుపేట పట్టణ శివారు ఎస్.ఆర్.కె. టి కాలనికి చెందిన వృద్ధురాలు మంజుల ఫిర్యాదు చేశారు. ఇటీవల న్యాయవాది డబ్బులు రావాలని తేల్చి చెప్పగా, అదే ప్రమాదంలో మృతి చెందిన మరో మహిళ మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా తనకు జరిగిన అన్యాయం గురించి న్యాయ పోరాటానికి సిద్ధమైన తనకు న్యాయం చేయాలని కోరారు.

కబ్జా స్థలం విడిపించాలని వినతి

కబ్జా కోరల్లో ఉన్న తమ స్థలాన్ని విడిపించాలని వినుకొండ చీకటి కాలనీకి చెందిన లలిత జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. 9 ఏళ్ల క్రితం రూ 5 లక్షలకు ప్రభుత్వ స్థలాన్ని 40 ఏళ్ళ నుండి అనుభవిస్తున్న లబ్ధిదారుని వద్ద నిబంధనల మేరకు కొనుగోలు చేసిన స్థలాన్ని వార్డు కౌన్సిలర్లమని చెప్పుకుంటున్న తేజ,కళ్యాణ్ తదితరులు కలిసి తమ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారని దీనిపై నిలదీస్తే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వినుకొండ పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టర్ కోరారు.

ఇసుక విధానంతో ఉపాధి కోల్పోయాం

ప్రభుత్వ ఇసుక విధానంతో తెచ్చిన మార్పుల నేపథ్యంలో అక్రమార్కులు అక్రవ ంంగా మిషన్ల ద్వారా నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకు తోడుతున్నారని దీంతో పడవల ద్వారా ఇసుక తోడే 6 గ్రామాలకు చెందిన 2 వేల మందికి పైగా ఉపాధి కోల్పోయారని అచంపేట మండలం కోనూరు గ్రామానికి చెందిన కొందరు యువకులు పేర్కొన్నారు.ప్రయివేటు వ్యక్తులు అక్రమంగా ఒక వైపు కట్టలు వేసి నిబంధనలకు తూట్లు పొడుస్తూ మిషన్ల ఇసుక

తొడుతున్నారని గత ప్రభుత్వంలో ట్రక్ ఇసుక రూ 600/- సమీప గ్రామాలకు చేరే ఇసుక ప్రస్తుతం రూ 4 నుండి 5 వేలు వరకు ధర పలుకుతుంది అక్రమ కట్టలతో కొన్ని గ్రామాలలో తాగునీటి సమస్య ఎదురైందని దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోనూరుకు చెందిన జంగిలి గంగాధర్, యండ్రపల్లి అశోక్, చింతపల్లి తిరుపతయ్య,శ్రీనివాస్, దారా డేవిడ్ రాజు, గమిడి శ్రీనివాస్ తదితరులు ఫిర్యాదు చేశారు.

దళిత వాడలపై చిన్న చూపు తగదు

పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం, విప్పర్ల వద్ద ఉన్న హైవే నిర్మాణంలో భాగంగా గతంలో వున్న డ్రైనేజీ ని తొలగించడంతో ఊరి చివరగా ఉన్న ఎస్.సి కాలనీలో మురికి నీరు చేరుకోవడంతో అక్కడి ప్రజలు అనేక ఇబ్బందులకు ఎదుర్కుంటున్నారని దీంతో దళిత వాడ ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నారని మురుగునీరు దారి మళ్లించి సమస్య పరిష్కరించాలని టిడిపి నియోజకవర్గ భాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రవహించే మురుగు నీరు మొత్తం ఎస్సీ కాలనీ వీధుల మీదుగా ప్రవహిస్తుండటంతో కాలనీ వాసులు అనేక అవస్థలు పడుతున్నారని దళిత వాడలపై చిన్న చూపు ఎందుకు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు వాసనకు, దోమల బెడదతో కాలనీ వాసులు అనారోగ్యల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. దీనిపై పలు మార్లు పంచాయతీలో, స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నా రని తెలిపారు. వర్షం కురిసిన సందర్భంలో సమస్య మరింత జఠిలంగా ఉంటుంద న్నారు. అదే గ్రామంలో సిసి రోడ్డుపైన మళ్లీ సిసి రోడ్ నిర్మించడానికి నిధులు ఉంటాయి కానీ ఎస్సీ కాలనీకి డ్రైనేజీ ఏర్పాటు చేయడానికి మాత్రం నిధులు ఉండవా అంటూ అక్కడి ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారని అయినా అధికారులు మొద్దు నిద్ర వీడడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళిత వాడ ప్రజల సమస్య పరిష్కరించాలని చదలవాడ కోరారు.

'నవోదయం'ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

నవోదయం కార్యక్రమాన్ని అర్హులైన యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు.స్థానిక కలెక్టరేట్ ఆవరణ లో సోమవారం నవోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువత తమకు అవసరమైన విద్య, ఉద్యోగ, వ్యాపార, ఉపాధి, సాధికారిత కార్యకలాపాలపై అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసు కున్నారు ఉద్యోగాల కోసం 24 మంది, వాహనాలు, కోళ్ళ ఫారాలు, పశు పోషణ పథకాల ద్వారా రుణాల కోసం 152 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో ఎస్సీ, ఎస్టీ, సామాజిక వర్గాలకు చెందిన వారు 149 మంది, ఇద్దరు వెనుకబడిన తరగతులకు చెం దిన వారు వ్యాపారం కోసం, ఒకరు అగ్రకులానికి చెందిన పేద వికలాంగుడు వ్యాపారం నిమిత్తం రుణం కోసం పెట్టుకున్నారు. మొత్తం కలిపి 176 మంది నవోదయం కార్యక్రమంలో దరఖాస్తులు పెట్టుకున్నారు. 'నవోదయం' లో నరసరావుపేట మండలానికి చెందిన యు.నాగరాజు అనే యువ కుడు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నారు. నాగరాజు కు నెల్లూరు జిల్లా,తడ వద్ద ఏర్పాటు చేసిన శ్రీ సిటీ సోలార్ కంపినీ(సి.ఇ.టి.సి) ప్రయి వేటు లిమిటెడ్ లో మెకానిక్ ఆపరేటర్ గా ఉద్యోగ అవ కాశం రావడం తో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా నాగరాజు ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నారు. నాగరాజుకు నెలకు రూ.18 వేలు వేతనం అందనుందని నవోదయం నోడల్ అధికారి సంజీవ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ కో-ఆర్డినేటర్ అడపా పెద్ద గోపి రెడ్డి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ ఆర్.జి.కె. కుమార్ నాయక్ పాల్గొన్నారు.

నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కొల్లిపర

అకాల వర్షాలకు తడిసిన పంటలను మద్దతు ధరకు కొను గోలు చేసి పంట నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొల్లిపర మండల పరిధిలోని తూములూరు, అత్తోట, దావులూరు, కొల్లిపరలో పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టి మృతి

ప్రజాశక్తి-ఈపూరు

గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బోడే శంభునివారి పాలెం సమీపంలో కర్నూలు- విజయ వాడ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. వినుకొండకు చెందిన ఈర్ల వెంకటేష్ (25) భార్య స్వగ్రామం కనమర్లపూడి తిరుణాళ్ల వేడుకలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీకొట్టడంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి మతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై విప్పర్ల వెంకటరావు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్ తో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - వినుకొండ

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో రెండు వరిగడ్డివాములు దగ్ధమైన సంఘటన వినుకొండ మండలంలోని పెదకంచెర్ల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. సంఘటన పై గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కొలగాని వెంకటేశ్వర్లు చెందిన 15 ఎకరాల వరిగడ్డి, కొంగన ఆంజనేయులకు చెందిన 4 ఎకరాల వరిగడ్డి గ్రామం నుండి వెళ్తున్న విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వెంటనే సంఘటన ప్రాంతాన్ని చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు 19 ఎకరాల పశుగ్రాశం కాలి బూడిద అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం కట్టెంపూడిలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న కృష్ణారావు అనే వ్యక్తిని పోలీ సులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమ మద్యం విక్ర యిస్తున్నాడనే సమాచారం తెలుసుకున్న పోలీసులు సోమవారం అతని ఇంటిపై రైడ్ చేశారు. 8 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసి కృష్ణారావుని అదుపులోకి తీసుకుని పొన్నూరు రూరల్ పియస్‌లో కేసు నమోదు చేశారు. అతన్ని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినటుల రూరల్ ఎస్సై భార్గవ్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో గాయాలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

రోడ్డు ప్రమాదంలో పెదకూరపాడు గ్రామానికి చెందిన రెండో వీఆర్వో శ్రీకాంత్ కు గాయాలయ్యాయి. సోమవారం తమ స్వగహమైన మండలంలోని హుస్సేనగరం గ్రామం నుండి పెదకూరపాడు బయలుదేరారు. ఈక్రమంలో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆయనకు గాయాలు తీవ్రంగా తగిలాయి. గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

టోర్నీని ప్రారంభిస్తున్న వైవి ఆంజనేయులు

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి - నకరికల్లు

గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు క్రీడలు దోహదపడతాయని మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు అన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన నకరికల్లులో మండల స్థాయి ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. 64 జట్లు పాల్గొంటున్న టోర్నీలో విజేతకు రూ.15 వేలు, రన్నర్‌కు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.7,500 చొప్పున బహుమతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎస్.కోటేశ్వరావు, ఎ.పుల్లమ్మ, టి.వెంకట్రావు, ఎస్.అప్పారావు, పి.రాంబాబు, ఎన్.జానకిరామయ్య, ఫణిసూరి పాల్గొన్నారు.

తాము తయారు చేసిన గ్రీటింగ్ కార్డులతో చిన్నారులు

గ్రీటింగ్ తయారీతో సృజనాత్మకత, ఏకాగ్రత పెరుగుదల

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు అభివృద్ధి కమిటీ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం గ్రీటింగ్ కార్డుల తయారీపై శిక్షణిచ్చారు. వీటి వల్ల ఏకాగ్రతకు, సృజనాత్మకత పెరగడంతోపాటు మానసిక ఉల్లాసం వస్తుందని శిక్షకులు, గణపవరం జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరచారి చెప్పారు. నూతనేడాది, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, బాలల దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం తదితర సందర్భాల్లో పిల్లలే సొంతంగా గ్రీటింగ్ కార్డులు తయారు చేసుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో యడ్లపాడు అభివృద్ధి కమిటీ సభ్యులు కె.వాసు, కె.రాంబ్రహ్మం, ఉపాధ్యాయులు ఆర్.నాగేశ్వరావు, షేక్ మీరావలి, విజయ్, నాగరాజు, పూర్ణచంద్రరావు, పిఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు ఎన్.కాళిదాసు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బెల్లంకొండ : బెల్లంకొండ మండలం నందిరాజుపాలెంలో రూ.25 లక్షల ఎంపీ ల్యాడ్స నిధులతో కమ్యూనిటి హాల్ నిర్మాణానికి ఎంపిపి చెన్నపురెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు.బెల్లంకొండ అడ్డరోడ్డులోని కోళ్లూరు ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

కబడ్డీ క్రీడాకారుణులను పరిచయం చేసుకుంటున్న ఎంపిపి పద్మ వెంకటేశ్వరరెడ్డి

కుటుంబీకులు, బంధువుల నుండే వేధింపులు

పల్నాడు ఎస్పీ ఎదుట అర్జిదార్ల ఆవేదన - సత్వర పరిష్కారానికి ఆదేశం

అర్జిదార్లకు భోజనం వడ్డిస్తున్న ఎస్పీ, ఇతర అధికారులు

ప్రజాశక్తి - నరసరావుపేట

'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి 77 ఫిర్యాదులు రాగా పలువురి నుండి ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలు విన్నారు. అర్జిదార్లకు పట్టణానికి చెందిన వాసవి స్టీల్స్ యజమాని చిలకల రామకృష్ణ భోజనాన్ని సమకూర్చగా ఎస్పీ, ఇతర అధికారులు భోజనం వడ్డించారు. అనంతరం రామకృష్ణను ఎస్పీ సత్కరించారు. డీఎస్పీలు రవిచంద్ర, పల్లపురాజు, ఆదినారాయణ, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి విడతల వారీగా రూ.10 లక్షలు తీసుకుని తప్పుడు అపాయింట్‌మెంట్ లెటర్ పంపించి మోసం చేశారని అమరావతికి చెందిన ఒ మహిళ వాపోయారు. తమ డబ్బు తమకు ఇప్పించాలని వేడుకున్నారు. కౌలుకు సాగు చేస్తున్న తన పొలంలోని పంటను యజమాని, అతని పెదనాన్న దున్నేసి దూషించారని, నరసరావుపేట మండలం కాకాని గ్రామానికి వ్యక్తి ఫిర్యాదు చేశారు.

ఇంటిని మూడేళ్లుగా ఖాళీ చేయడం లేదు

చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన కోడిమేత రామాంజనేయులకు చెందిన ఇంటిని రూ.11 లక్షలకు తాను కొన్నానని, రిజిస్ట్రేషన్ కూడా చేశారని, అయితే ఇంటిని అమ్ముతున్న క్రమంలో 6 నెలలు ఇంటిలో ఉండి ఏదొక ఇల్లు చూసుకొని ఖాళీ చేస్తామని చెప్పిన వ్యక్తి మూడేళ్లయినా ఖాళీ చేయడం లేదని చిలకలూరిపేట మండలం గంగన్నపాలేనికి చెందిన మద్దుకూరి సాంబయ్య ఫిర్యాదు చేశారు. కనీసం అద్దె కూడా ఇవ్వడం లేదని, చిలకలూరిపేట రూరల్ పోలీసులను సంప్రదించినా న్యాయం చేయడం లేదని వివరించారు.

నన్ను వదిలించుకోవాలని చూస్తున్నాడు

పెళ్లి చేసుకొని బిడ్డ పుట్టాక తనను వదిలించుకోవాలని భర్త చూస్తున్నాడని సత్తెనపల్లికి చెందిన చల్లా ఆంజనేయులుపై మహిళ ఫిర్యాదు చేశారు. తనకు ఆంజనేయులుతో రెండేళ్ల కిందట వివాహమైందని, గర్భవతిగా ఉన్నప్పుడు పుట్టింటిలో వదిలి వెళ్లిన భర్త ఇంత వరకూ పట్టించుకోలేదని, బిడ్డ పుట్టి ఏడు నెలలైనా కనీసం చూసేందుకు రాలేదని చెప్పారు. దీనిపై ప్రశ్నిస్తే.. నేను లాయర్ దగ్గర గుమస్తాను.. నిన్ను ఎలా వదిలించుకోవాలో నాకు తెలుసు.. అంటూ బెదిరిస్తున్నాడని వాపోయారు.

స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారు

వారసత్వంగా వచ్చిన రెండు సెంట్ల స్థలాన్ని సమంగా పంచకుండా సమీప బంధువులైన మేకల నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, రమేష్, తిరుమలేష్ కబ్జా చేయాలని చూస్తున్నారని క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన మేకల పెద్దబ్బాయి ఫిర్యాదు చేశారు. తాను క్రోసూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సర్వేయర్ వచ్చి హద్దులు నిర్ణయించారని, వాటిని మిగతావారు తొలగించి దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు.

కాలేజీలో వాటా పేరుతో మోసం

2013లో చిలకలూరిపేటలోని సాయిశ్రీనివాస డిఇడి కాలేజీలో ఏవోగా పని చేసిన తనకు 2017లో కళాశాలలో పార్టనర్‌షిప్ ఇస్తామని చెప్పి కాలేజీ డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరెడ్డి, జె.పరమేశ్వర రావు, బి.శేషగిరి, షేక్ నజీర్ దశల వారిగా రూ.25 లక్షలు తీసుకున్నారని నరసరావుపేట మండలం పాలపాడుకు చెందిన ఎం.ఏడుకొండలు ఫిర్యాదు చేశారు. వాటాదారునిగా చేరదామని వారసత్వంగా వచ్చిన వాటాను అమ్మి డబ్బులిచ్చానని చెప్పారు. అయితే సరైన అనుమతులు లేకపోవడం, కళాశాల నిర్వహణలో లోపాల వల్ల కొంత మంది విద్యార్థులు తనపై కేసులు కూడా వేశారని చెప్పారు. మోసంపై తాను నిలదీయగా చంపుతామని బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించడంతోపాటు న్యాయం చేయాలని కోరారు.

రక్షణ కోసం నవదంపతుల వేడుకోలు

ఒకే సామాజిక తరగతికి చెందిన తాము పెద్దలను ఎదిరించి ప్రేమ పెళ్లి చేసుకున్నామని తమకు తల్లిదండ్రుల నుండి రక్షణ కల్పించాలని మండల కేంద్రమైన రెంటచింతల చెందిన తాళ్లూరి అశోక్ కుమార్, మామిడి సంధ్య ఎస్పీని ఆశ్రయించారు. తన కుటుంబీకులు పెళ్లికి అంగీకరించకపోవడంతో సాగరమాత ఆలయంలో పెళ్లి చేసుకున్నామని, తల్లిదండ్రులు ఇంటికి బలవంతంగా తీసుకెళ్లగా వారి నుండి తప్పించుకుని వచ్చానని యువతి వాపోయారు. తన తల్లిదండ్రుల నుండి భర్తకు ప్రాణ హాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

కొడుకు రోజూ కొడుతున్నాడు

తన కొడుకు ప్రతిరోజూ మద్యం తాగి కొడుతున్నాడని, మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన దాసరి లక్ష్మీ నరసమ్మ ఫిర్యాదు చేశారు. తనకు ఇద్దరు కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని, భర్త చనిపోయాడని, చిన్న కుమారుడు వ్యసనాలకు బానిసై తనపేరిట ఉన్న ఆరెకరాల కోసం నిత్యం కొడుతున్నాడని, ప్రశ్నించినందుకు పెద్ద కుమారుణ్ణి కొట్టి చేయి విరగ్గొట్టాడని చెప్పారు. మాచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు.

తమ్ముడి మోసంపై అన్న ఫిర్యాదు

తల్లిదండ్రులు ద్వారా వచ్చిన ఇంటి స్థలాన్ని సమానంగా పంచకుండా వికలాంగుడినైన తనపై తమ్ముడు, అతని భార్య దౌర్జన్యం చేస్తున్నారని ఈపూరు మండలం ఇనిమెళ్లకు చెందిన లంజపల్లి వెంకటకోటయ్య ఫిర్యాదు చేశారు. 3 నెలల క్రితం మృతి చెందిన తల్లి అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాలకు రూ.60 వేల వరకు ఖర్చయ్యాయని, అందులో సగం ఇస్తే ఇంటి స్థలం ఇస్తామని చెప్పగా ముప్పాళ్ల మండలంలో పారిశుధ్య పనులకు వెళుతూ రూ.19 వేలు ఇచ్చానని, అయినా స్థలం ఇవ్వకుండా బెదిరిస్తున్నారని చెప్పారు.

తోటి మహిళని ఆదరిస్తే మోసం

భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న తన వద్దకు కృష్ణా జిల్లా చందర్లపాడు నుండి భర్తతో విభేదించిన మహిళ కాస్తాల వెంకటరమణ వస్తే ఆదరించానని, జగనన్న కాలనీలో స్థలం మంజూరవగా ఇంటి నిర్మాణం కోసం రూ.7 లక్షలు ఇచ్చానని, ఇప్పుడు ఆమె కుమారులు ఇంటిని ఆక్రమించారని, తన డబ్బును కూడా ఇవ్వడం లేదని, వెంకట రమణ కూడా వారితోనే కలిసిపోయిందని క్రోసూరు మండలం దొడ్లేరుకు చెందిన తాళ్లూరి వజ్రం ఫిర్యాదు చేశారు. క్రోసూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో ఇక్కడికి వచ్చానని, తన డబ్బు తనకు ఇప్పించాలని వేడుకున్నారు.

డబ్బును కాజేసిన వారిని పట్టుకోవడం లేదు

తన డబ్బును కాజేసిన యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం చేయడం లేదని రొంపిచర్ల మండలం రైతునగర్‌కు చెందిన ఏలూరి సిద్ధారావు ఫిర్యాదు చేశారు. ఈనెల 9న తన పొలాన్ని బ్యాంకులో తనఖాపెట్టి రూ.1.48 లక్షలు తీసుకున్నాని, బ్యాంకు బయట ఉన్న కొందరు యువకులు ఆ డబ్బును కాజేయగా ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సిసి ఫుటేజ్ సేకరించారని చెప్పారు. అయితే అప్పటి నుండి స్టేషన్ చుట్టూ తిరుగున్నా పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటి నుండి కుమారుడే గెంటేశాడు

తన ఇద్దరు కుమారులకు పెళ్లిళ్లు చేయడంతోపాటు ఇళ్లనూ కట్టించానని, అయితే చిన్న కుమారుడు అతని ఇంటిని అమ్ముకోవడంతోపాటు ఇప్పుడు నేనుంటున్న ఇంటి నుండి తనను గెంటేశాడని రాజుపాలెం మండలం అనుపాలేనికి చెందిన ఉప్పు కాశయ్య ఫిర్యాదు చేశారు. కుమార్తె దగ్గర తలదాచుకుంటున్నానని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

వ్యాపారం పేరుతో మోసం

పశువుల దాణా వ్యాపారం చేద్దామని తన వద్ద నరసరావుపేట పట్టణ సమీపంలోని లింగంగుంట్లకు చెందిన కనకరాజు కోటిరెడ్డి రూ.32 వేలు తీసుకొని మొహం చాటేశాడని నరసరావుపేటకు చెందిన కొటేశం గుప్తా కుమార్తె ఫిర్యాదు చేశారు. చూపు మందగించడంతో తాను చేస్తున్న చిరుద్యోగం కూడా కోల్పోయి ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని, న్యాయం చేయాలని వేడుకున్నారు.

పని చేయించుకొని డబ్బులు ఇవ్వడం లేదు

రాడ్ బెండింగ్ పనులు చేయించుకొని కూలీ డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నారని విజయవాడకు చెందిన మెస్త్రి సుభానిపై సత్తెనపల్లికి చెందిన గోన ప్రసన్నకుమార్ ఫిర్యాదు చేశారు. కొండమోడులో పనులు చేయించుకొన్న మెస్త్రి సుభాని డబ్బులు ఇవ్వకపోవడంతో తనను నమ్మి పనికి కులీలు తనను ఇబ్బంది పెడుతున్నారని, రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం చేయలేదని అన్నారు.

స్థలాన్ని బంధువులే కబ్జా చేశారు

తన ఏడు సెంట్ల స్థలాన్ని అధికార పార్టీ నాయకుల అండతో సమీప బంధువులైన వల్లాల పాప, వెంకట్రావు, వెంకయ్య, సైదయ్య కబ్జా చేశారని, చంపుతామంటూ బెదిరిస్తున్నారని రాజుపాలెం మండలం చౌటపాపాయిపాలేనికి చెందిన కుంటేళ్ల గురవయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై గతనెల 27న ఇక్కడే ఫిర్యాదు చేశానని తెలిసి కబ్జాదారులు ఇంకా ఎక్కువగా వేధిస్తున్నారని, తన స్థలంలో 40 ఏళ్ల నాటి మహావృక్షాన్నీ కొట్టేశారని వాపోయారు.

ఉపాధి కూలి బకాయిలురూ.1.69 కోట్లు వెంటనే చెల్లించాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

ఉప్పలపాడులో ఉపాధి పనుల పరిశీలన - 22న గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలని పిలుపు

ప్రజాశక్తి -పెదకాకాని : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టానికి నిధులుకేటాయించి పటిష్టంగా అమలు జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. సోమవారం పెదకాకాని మండలం ఉప్పలపాడులో ఉపాధి పననులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాశం రామారావు మాట్లాడుతు నాడు యుపిఎ ప్రభుత్వ కాలంలో వామపక్షాలు, ప్రజాసంఘాల పోరాటంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సవత్సరానికి వంద పనిదినాలు కల్పించి రోజుకు రూ.272 కనీస వేతనం ఇవ్వాలని కోరారన్నారు. జిల్లాలో కూలీలకు సరాసరి 50 రోజులు కూడా పని చూపడంలేదన్నారు. ఉప్పలపాడులో మూడు వారాలు పనిచేసిన కూలీలకు ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదన్నారు. పే స్లిప్పులు వారానికి ఒకసారి ఇవ్వాలన్నారు. గతంలో ఇస్తున్న మేట్ పారితోషకం కూడా రద్దు చేశారని, సమ్మర్ అలవెన్స్ కూడా ఇవ్వడం లేదన్నారు.తాగునీటికి రోజుకు రూ.5లు, పలుగు, పార పదును పెట్టుకోవడానికి వారానికి రూ.50 ఇవ్వాల్సి ఉండగా వీటిని కూడా రద్దు చేశారన్నారు. ఎండా కాలంలో మజ్జిగ ఇవ్వాల్సి ఉండగా అమలు జరగడం లేదన్నారు. గత సంవత్సర వేతన బకాయి రూ.కోటి69లక్షల47వేలు ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని రామారావు డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజి మాట్లాడుతు ఉపాధి పని ప్రదేశంలో కనీస వసతులు టెంట్, మంచినీళ్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు రెండు పూటలా చేయాలని నిబంధనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి గుంటూరు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా నాయకులు బి శ్రీనివాసరావు, కె హరిబాబు, సిహెచ్ వెంకటేశ్వరరావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో కనీస వసతులు కరువు : వ్యకాస

పెదనందిపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు తదితరులు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

పని ప్రదేశంలో కనీస వసతులు లేక మండిపోతున్న ఎండల్లో బ్రతుకు తెరువు కోసం ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని, వీరికి పెండింగ్ వేతన బకాయలు రూ. 5.8లక్షలు చెల్లించకుంటే ఎలా జీవిస్తారని తక్షణం వీరికి బకాయి వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెదనందిపాడు ఇన్‌ఛార్జి ఎండిఒ సాయి లీలకు వినతి పత్రం అందజేశారు. అంతకుముందుగా పెదనందిపాడు మండలంలోని ఉపాధి పని ప్రదేశాన్ని సిఐటియు నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, కౌలు రైతు మండల నాయకులు చుక్కా యానాదులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధి కూలీలు తమ సమస్యలను నాయకులకు తెలిపారు. మూడు నాలుగు వారాలుగా డబ్బులు పడలేదని, గత సంవత్సరం కనీసంగా కల్పించిన వసతులు కూడా ఇప్పుడు కల్పించలేదని తెలిపారు. పని ప్రాంతానికి గ్రామం నుండి మూడు కిలోమీటర్లు దూరం వస్తున్నామని, ఎండలు మండిపోతున్నా కనీసం మంచినీళ్లు కూడా ఏర్పాటు చేయలేదని వాపోయారు. కార్మికులనుద్దేశించి అప్పారావు మాట్లాడుతు కంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు గత సంవత్సరం కంటే 30 వేల కోట్ల రూపాయలు నిధులు తగ్గించి. కూలీలకు ఈ పని యడల ఆసక్తి తగ్గే విధంగా రకరకాల నిబంధనలను ప్రవేశపెట్టారని అలాగే కనీస వేతనం 272 రూపాయలు ఉన్నప్పటికీ 200 రూపాయలు మాత్రమే వేతనం పడుతుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు పాత బకాయాలను సాధించుకు నేందుకు ఈనెల 22వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అప్పారావు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పెదనందిపాడు మండల కార్యదర్శి ఎం. వెంకటరమణ, ఉపాధి కార్మికులు దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్వింటా పసుపు రూ.10వేల మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలో పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు డిమాండ్

పలు మండలాల్లో తహశీల్దార్లకు నాయకుల వినతులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పసుపు క్వింటా రూ.10వేల మద్దతు ధర ప్రకటించి, రైతుల వద్ద నుండి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు అన్నారు. సోమవారం ఏంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద పసుపు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ పసుపు వేసిన రైతులకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగి, పసుపు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. గతంలో పసుపు క్వింటా రూ.6850 మద్దతు ధర ప్రకటించారని, కానీ కొనుగోలు చేయడం లేదని అన్నారు. పసుపు పంటను సాగు చేసే రైతులు పసుపు పంట వేసేందుకు సుముఖంగా లేరని, పురుగు మందులు, పసుపు వండడం, వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగాయన్నారు. పసుపు పంట వేసిన రైతులకు సరైన మద్దతు ధర లేకపోవడంతో క్వింటా పసుపును రూ.4200 నుండి 5000 లోపు మాత్రమే అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అదేవిధంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కల్లాలలో వండి ఆరబోసిన పసుపు తడవడం వలన రంగు(కటుకు) మారిందన్నారు. రంగు మారిందని కారణంతో వ్యాపారులు రైతుల వద్ద నుండి అమ్ముకునే ధర కంటే, వెయ్యి రూపాయల తక్కువ ధరకు కొంటున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పసుపు రైతులను ఆదుకునే దాంట్లో విఫలం అయిందని విమర్శించారు. ఈ పరిస్థితులలో పసుపు పంట వేసిన రైతు తీవ్ర నష్టాల్లో కూరుకు పోతున్నారని, తక్షణమే రైతులను ఆదుకునేందుకు కనీస మద్దతు ధర రూ.10వేలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తాడేపల్లి మండల తాసిల్దార్ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రాజధాని రైతు సంఘం నాయకులు కొర్రపోలు ఈశ్వర్ రెడ్డి, బుర్ర ముక్కు ఈశ్వరరెడ్డి, టి బక్కిరెడ్డి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తెనాలి:** పసుపుసాగు చేసిన రైతులు నష్టాల ఊబిలో ఉన్నారని, క్వింటాళ్ కు రూ.10వేలు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఈ మేరకు తహశీల్దార్ కె.రవిబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ మార్చి, మే నెలలో కురిసిన వర్షాలకు కల్లాల్లో వండి, ఆరబెట్టిన పసుపు తడిసి పోయిందన్నారు. ప్రభుత్వం క్వింటాళ్‌కు రూ.6850 మద్దతు ధర ప్రకటించినా, ఆ మేరకు కొనుగోలు చేయకపోవటంతో దళారులు రంగ ప్రవేశం చేసి పసుపు తడిసిందని, రంగు మారిందని చెప్పి కేవలం రూ.4వేల నుంచి రూ.4,500లోపే కొనుగోలు చేయటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్వింటాళ్‌కు రూ.10వేల మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముద్దన సాంబశివరావు, షేక్ హుస్సేన్‌వలి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-దుగ్గిరాల :** మద్దతు ధరకు ప్రభుత్వం పసుపు కొనుగోలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కె మల్లేశ్వరికి అర్జీని అందజేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పసుపు పంట తడిసి తీవ్రంగా నష్టపోయిందని మరో ప్రక్క ధ ర క్వింటాలుకు రూ.4200 నుండి 5000 వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు దీనితో రైతు రెండు విధాలుగా నష్టపోతున్నారన్నారు. పసుపు ఖర్చుతో కూడుకున్న పంట కౌ లుతో కలిపి ఎకరాకు 1,70,000 నుండి 2 లక్షల వరకు ఖర్చు అవుతుంది దిగుబడి ధరలను బట్టి ఎకరాకు 70000 నుండి లక్ష రూపాయలు వరకు నష్టం వస్తుందని తెలిపారు. ఆర్‌బికెల ద్వారా మద్దతు ధరకు పసుపు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వల్లభనేని సాంబశివరావు, రైతు సంఘం మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వర రావు, బి అమ్మిరెడ్డీ తదితరులున్నారు.

దుగ్గిరాలలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు వి సాంబశివరావు తదితరులు

తెనాలిలో వినతి పత్రం ఇస్తున్న నాయకులు వి సాంబిరెడ్డి తదితరులు

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తులసీ ధర్మచరణ్ తదితరుల

యర్రంశెట్టి అధ్వర్యంలో భారీ అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు: హనుమాన్ జయంతిని పురష్కరించుకుని గోరంట్ల, మెయిన్ రోడ్డులోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గోరంట్ల గ్రామ మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ముఖ్య అతిధిగా హజరయ్యారు. కార్యక్రమంలో యర్రంశెట్టి సూరి, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, తోట రంగారావు, గాజుల సాయిరాం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికురాలి కుమార్తెకు చెక్కు అందచేస్తున్న కమిషనర్

అవుట్‌సోర్సింగ్ కార్మికురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య కార్మికురాలి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ను సోమవారం కాన్ఫరెన్స్ హాల్లో కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజారోగ్య విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహించే టి.మరియమ్మ ఇటీవల కాలంలో మరణించారని, వారి కుమార్తె జి.స్మయిలీకి ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షల చెక్ ని అందించామని తెలిపారు. ఇతర కార్మికులు కూడా తమ సమస్యల పై ప్రతి గురువారం జరిగే ఉద్యోగుల గ్రీవెన్స్ లో అర్జీలు లేదా ఫిర్యాదులు అందిచవచ్చని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మాయ చదరం' మ్యాజిక్ శిక్షణ

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో అరవింద హైస్కూల్లో మ్యాజిక్ శిక్షణా తరగతుల్లో సోమవారం ప్రముఖ ఇంద్రజాలికులు క్రాంతికార్ 'మాయ చదరం' మ్యాజిక్‌ను చేసి చూపించారు. సుమారు మూడడుగుల కర్ర చేతిలో గిరగిర తిరుగుతున్న సందర్భంలోనే దాని నుంచి కర్ర మాయం అయ్యి రెండు చేతుల్లోకి రెండు రంగుల గల క్లాత్ రావడం పిల్లలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. అలాగే మరో రెండడుగుల కర్ర నుంచి తెల్లటి పుష్పం తెప్పించి పిల్లలను ఆశ్చర్యకితులను చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి సుందరయ్య నగర్‌లో పిల్లలకు ఉచిత ట్యూషన్‌తో పాటు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషు లాంటి తరగతులు నిర్వహిస్తున్న కొట్టె కరుణాకరరావు మాట్లాడుతూ మ్యాజిక్‌తో మనసు ఉత్తేజం పొందుతుందని చెప్పారు. శాస్త్రీయ ఆలోచనలు పెంపొందిస్తాయన్నారు. మూఢాచారాల వైపు వెళ్లకుండా మ్యాజిక్ దోహదపడుతుందని చెప్పారు. ప్రశ్నించేతత్వం జీవితంలో ఒక భాగం కావాలన్నారు. మంచి మేజీషియన్లుగా తయారు కావాలని పిల్లలను కోరారు. మ్యాజిక్‌తో విజేతలుగా నిలవడంతో పాటు సమాజ సేవలో కూడా భాగం కావాలన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, విశ్రాంత ఎంపిడిఒ ఆదినారాయణ, మేజీషియన్ గాజుల పిచ్చయ్య పాల్గొన్నారు.

ఆధార్ మార్పుల కోసం పనులు మానుకోవాలా? : సిఐటియు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఆధార్ కార్డులో తప్పుల సవరణకు గెజిటెడ్ సంతకం అవసరమంటూ కార్డుదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో అందర్నీ ఆధార్ కార్డులో వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలంటున్నారని, అయితే అందుకు అవసరమైనన్ని ఆధార్ కేంద్రాలను మాత్రం ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. కూలిపనులకు వెళ్తేగాని పూట గడవని పేదలు తమ పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరగడం సాధ్యమవుతుందా? అని ప్రశ్నించారు. పైగా ధ్రువపత్రాలపై గెజిటెడ్ అధికారులతో సంతకాలు చేయించుకుని రావాలంటున్నారని, ఇవన్నీ జనమే చేయించుకుంటే ఇక సచివాలయ వ్యవస్థ ఎందుకని ప్రశ్నించారు. అన్ని సచివాలయాల్లోనూ ఆధార్ అప్‌డేషన్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు కార్డు అప్‌డేషన్ కోసం ఒక్కొక్కరి వద్ద రూ.50 వసూలు చేయడం సరికాదని, ఉచితంగా చయాలని కోరారు.

'కేరళ స్టోరీ'ని ప్రదర్శించొద్దని ర్యాలీ

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక వెంకటేశ్వర థియేటర్‌లో ప్రదర్శిస్తున్న కేరళ స్టోరీ చిత్రం ప్రదర్శన నిలిపేయాలని ముస్లిం మైనారిటీలు సోమవారం నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ జానీబాషకు వినతిపత్రం ఇచ్చారు. మతసామరస్యానికి భంగం కలిగించేలా ఉన్న చిత్రప్రదర్శన సరికాదన్నారు. సుభాని, మహమ్మద్, సయ్యద్ ఉస్మాన్ పాల్గొన్నారు.

కొనసాగిన మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం పిఎస్ వికె ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రం సోమవారం 4వ రోజు కొనసాగింది. మంగళవారం కేంద్రాన్ని దాతలు సిఐటియు నాయకులు మామిడి జగన్నాథరావు ప్రారంభించారు. పి.సూర్యప్రకాశరావు, డి.విమల, జె.రాజకుమార్, కె.జగన్, ఎ.వెంకట్ నారాయణ, కె.శివదుర్గారావు పాల్గొన్నారు.

రెంటచింతల పిహెచ్‌పి పరిధిలోకి రెండు గ్రామాలు

ప్రజాశక్తి - రెంటచింతల

రెంటచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి మంచికల్లు, పాలువాయిగేటు గ్రామాలను విలీనం చేస్తూ వైద్యారోగ్య శాఖ కమిషనర్ నివాస్ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ రెండు గ్రామాలు ఇప్పటి వరకు కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్నాయి. కంభంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 2008 ఆగస్టు 25న అప్పటి సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు.

పంచాయతీ కార్మికుల దీక్ష విజయవంతం

- నెలరోజుల్లో వేతన బకాయిలు చెల్లించేందుకు తుమ్మలచెరువు సర్పంచ్ హామీ
- దీక్షలను విరమించిన పంచాయతీ పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేస్తున్న జి.రవిబాబు, ఏపూరి గోపాలరావు

పెండింగ్ జీతాల కోసం పది రోజులుగా ఆందోళన చేస్తున్న మండలంలోని తుమ్మలచెరువు పంచాయతీ పారిశుధ్య కార్మికులు దీక్షలను సోమవారం విరమించారు. బకాయిలను నెలరోజుల్లో చెల్లిస్తామనే సర్పంచ్ బి.కుమారి హామీ ఇచ్చారు. తొలుత దీక్షా శిబిరాన్ని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రవిబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు సందర్శించారు. అనంతరం సర్పంచ్‌తో చర్చించగా బకాయి వేతనాలు, ఇతర సదుపాయాలను నెలలో చెల్లిస్తామని సర్పంచ్ హామీ ఇవ్వడంతో దీక్షల్లో ఉన్నవారికి నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలివ్వకుంటే పేదలైన కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. స్వచ్ఛ భారత్ కింద కేంద్రం ఇస్తామని చెప్పిన రూ.6 వేల భారాన్ని పంచాయతీలపై మోపిందని, దీంతో నిధుల్లేక అల్లాడుతున్న పంచాయతీలకు ఇది గుదిబండగా మారిందని సరపంచ్ చెప్పినట్లు తెలిపారు. పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ కార్మికులకు రూ.10 ఏవల వేతన జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు సంపత్ వెంకటకృష్ణ, టి.శ్రీనివాసరావు, కార్మికులు జి.సుందర్రావు, బి.రాజేశ్, సామ్యేలు, సుందర్‌రావు, శిరీష, జగన్నాథం, బ్రహ్మానందం, ఏపూరి కొండ, సామ్రాజ్యం, దేనమ్మ, ఏసమ్మ పాల్గొన్నారు.

ఆహారం బాగుంటే విక్రేతకు సర్టిఫికెట్

ప్రజాశక్తి - నరసరావుపేట

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

హోటళ్లు, బడ్డీ కొట్లలో, చికెన్ స్టాల్‌లో ప్లాస్టిక్ వినియోగించకుండా నిషేధం పాటించడం, విద్యుత్, నీటి వృథాను అరికట్టడం, పరిశుభ్రతపై నిర్వాహకుల్లో అవగాహన పెంచాలని అధికారులకు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. క్లీన్ స్ట్రీట్ ఫుడ్ హబ్‌పై మున్సిపల్ కమిషనర్, జిల్లా సరఫరాల అధికారి, ఫుడ్ సేఫ్టీ అధికారులతో జెసి తన కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఏక వినియోగ ప్లాస్టిక్లను ఉపయోగించే వీధి విక్రేతలు ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. కలుషిత ఆహారం సరఫరా కాకుండా ఉండేందుకు జిల్లా సరఫరాల అధికారి, మున్సిపల్ కమిషనర్, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. ఆహార పదార్థాలు పార్సిల్ చేసే ప్రక్రియలో ప్లాస్టిక్ వినియోగించకుండా ధృడమైన కాగితపు కవర్లు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తున్న హోటళ్లకు గుర్తింపు సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తున్న తోపుడుబండ్లను గుర్తించి వారి ఫొటోలను, నమూనాలను సేకరించాలని, వారికి ప్రోత్సాహంగా ప్రశంసా పత్రాలివ్వాలని సూచించారు.

సత్తెనపల్లి నుండి పచ్చిరొట్ట ఎరువుల సరఫరా

ఆర్టీసీ కార్గో ద్వారా సరఫరా చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైతు భరోసా కేంద్రాలకు పచ్చిరొట్ట ఎరువులు ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా సరఫరా చేస్తున్నారు. పల్నాడు జిల్లాలోని 431 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు పింపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించు కుంటున్నారు. ఇందులో భాగంగా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లాలో 6 వేలు క్వింటాళ్లు జనుము, జిలుగ, పిల్లి పెసర విత్తనాలు సరఫరా చేయాల్సి ఉండగా మొదటి విడతగా 1500 క్వింటాళ్ళు స్టాకు పాయింట్‌కు చేరాయి. ఎపి సీడ్స్ ద్వారా పచ్చి రొట్ట ఎరువులు సరఫరా చేస్తున్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ కార్గో సర్వీస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్టాకు పాయింట్ నుండి సోమవారం ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసినట్లు స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జి సత్యంబాబు తెలిపారు.

కొండ్రముట్లలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం

ప్రజాశక్తి-ఈపూరు

ఖరీఫ్ ప్రారంభానికి ముందుగానే రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని, ప్రధాన పంట విత్తనాలనూ రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉపసంచాలకులు ఎం.శివకుమారి చెప్పారు. మండలంలోని కొండ్రముట్లలో 'ఖరీఫ్ సాగుకు సమాయత్తం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. శివకుమారి మాట్లాడుతూ కౌలురైతులు సిసిఆర్‌సి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పంటల సాగులో అధికారుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల ఏవో ఆర్.రామారావు, పశువైద్యాధికారి గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి- పెదకూరపాడు

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలని రైతులకు మండల వ్యవసాయాధికారి శాంతి సూచించారు. సోమవారం మండలంలోని ఖమ్మంపాడు, బలుసుపాడు గ్రామాల్లో 'ఖరీఫ్ సాగుకు సమాయత్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. లైసెన్స్ పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు తీసుకోవడం, రసీదుపై బ్యాచ్ నెంబరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. పంట పూర్తయ్యే వరకూ విత్తన ప్యాకెట్లను దాచుకోవాలని సూచించారు.

పిఎం శ్రీకి ఎంపికైన తుమ్మకోట పాఠశాల

ప్రజాశక్తి - రెంటచింతల

ప్రధానమంత్రి స్కూల్ ఫర్ ఇండియా (పిఎంశ్రీ) పథకం కింద ఎంపికైన పాఠశాల నిధులు పొందేందుకు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను ప్రారంభించాలని ఎంఇఒ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మకోటలోని మెయిన్ స్కూలు పిఎం శ్రీకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తారని, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జీరో బ్యాలెన్స్‌తో కొత్త ఖాతాను ప్రారంభించాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

సబ్సిడీతో టైఫాయిడ్ నిరోధక టీకాలు

ప్రజాశక్తి-రొంపిచర్ల

టైఫాయిడ్ నిరోదక టీకాలను సబ్సిడీతో స్థానిక బిసి కాలనీలోని భగత్ సింగ్ భవన్‌లో సోమవారం అందించారు. పోరంకి మోహన్ కుమార్, సరోజా దంపతుల ఆర్థిక సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో 40 మందికిపైగా టీకాలు అందించారు. జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.చలపతిరావు మాట్లాడుతూ టైఫాయిడ్ నిరోధక టీకాలు వేయించుకున్న వారికి మూడేళ్లపాటు ఆ రోగం రాదన్నారు. ప్రతి మూడేళ్లకోసారి టీకా వేయించుకోవడం ఉత్తమమని చెప్పారు. టీకాలపై అపోహలు, భయాలు వద్దని, మూఢ నమ్మకాల ఉచ్చులో పడకుండా శాస్త్రీయ జ్ఞానాన్ని నమ్మాలని సూచించారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.రామకష్ణంరాజు, శేషంరాజు, మస్తాన్‌వలి, బాజీరాణి పాల్గొన్నారు.

క్షతగాత్రురాలికి ఎంఆర్ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని ఉన్నవకు చెందిన పరమాత్ముల కోటేశ్వరమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలోతీవ్రంగా గాయపడి కాలు పోగొట్టుకున్నారు. కూలి పనులు చేసుకుని జీవించే ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితి దెబ్బతినడంతో ఎం.ఆర్.ఫౌండేషన్ ఛైర్మన్ మల్లెల రాజేష్‌నాయుడు రూ.10 వేలను ఆర్థిక సాయాన్ని సోమవారం అందించారు.

చలివేంద్రం ఏర్పాటు చేయండి

పలు కేసుల నిమిత్తం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి విజ్ఞప్తి

తాడేపల్లి పీఎస్‌లో తాగు నీరు లేకపోవడంతో అవస్థ పడుతున్న ఓ తల్లీబిడ్డ

ప్రజాశక్తి-తాడేపల్లి

వివిధ కేసుల పరిష్కారం నిమిత్తం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారు మంచినీరు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. గత వారం నుంచి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు పెద్దఎత్తున బాధి తులు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మంచినీరు అందుబాటులో లేక పోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. ఓ పక్క తీవ్రమైన వడగాల్పులు, మండుతున్న ఎండల్లో స్టేషన్‌కు పని మీద వచ్చిన వారి దాహం కేకలు వినిపిస్తున్నాయి. సోమవారం ఓ తల్లీబిడ్డ పని మీద స్టేషన్‌కు వచ్చారు. మంచినీటి కోసం వారు పడిన బాధలు వర్ణ నాతీతంగా ఉన్నాయి. అక్కడ ఉన్న ఖాళీ బాటిల్ తీసుకుని అందులో ఏమైనా నీరు ఉందేమోనని వెతుకులాడటం చూపరులను కంటతడి పెట్టించింది. సమయానికి అక్కడ ఉన్న మీడియా వారు గమనించి వారికి మంచి నీరు బాటిల్ అందించి దాహాన్ని తీర్చారు. పోలీస్‌స్టేషన్ ముందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గతంలో చలి వేంద్రం ఏర్పాటు చేసేవారు. అక్కడ మళ్లీ చలి వేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దొంతిరెడ్డి వేమారెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి -తాడేపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళగిరి నియో జకవర్గం లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంటిఎంసి వైసిపి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి. చెప్పారు. సోమవారం రాత్రి ఆపార్టీ కార్యకర్తలు స్థానిక గౌడ సంఘం కళ్యాణ మండపంలో ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నిమ్మ కాయల రాజనారాయణ, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల మాట్లాడుతు సరైన సమయంలో వైసిపి అగ్ర నాయకత్వం సరైన నిర్ణయం తీసుకుందని చెప్పారు. వేమారెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కె వెంకటేశ్వర రావు, చింకా గంగాధరరావు, ఎండి గోరే బాబు, నిర్మల, మాజీ వైస్ ఛైర్మన్ డి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టివి ఆర్టిస్ట్ రమణారావుకు ఎన్టిఆర్ సత్కారం

రమణారావుకు జ్ఞాపిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ సం యుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శత జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో సోమవారం ఎన్టీఆర్ నటించిన రాముడు-భీముడు చిత్రాన్ని ఉచి తంగా ప్రదర్శించారు. శతాబ్ది ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో ప్రముఖ పౌరాణిక, నాటక, రేడియో, టివి కళాకారుడు గుత్తా వెంకట రమణారావు ను పార్టీ నాయకులు ఫణిదపు దుర్గ నరసింహారావు, అనిశెట్టి సత్య నారాయణ, సిహెచ్ శ్రీనివాసరావు, సోమవారపు సాంబశివరావు తదితరులు ఎన్టీఆర్ జ్ఞాపికను అందించి సత్కరించారు.

పలుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ఐదు ప్రాంతాల్లో వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణు గోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో సోమ వారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. క్రిష్టియన్‌పేట, మణిపాల్ ఆసుపత్రి, నులకపేట సెంటర్, ప్రకాష్ నగర్, డోలాస్‌నగర్ ప్రాం తాల్లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చలివేంద్రాల ప్రారంభం సందర్భంగా ఆయా చోట్ల మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు ఎం.వెంకటరామిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పించండి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి భవనం పద్మలీల

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతికూలికి వంద రోజుల పని కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని పొన్నూరు మండలం ఎంపిపి భవనం పద్మలీల అన్నారు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజిఎస్ పథకం సమీక్ష సమా వేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఈవోపీఆర్డీ శివ సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పనులను కనుగొని ప్రతి ఒక్కరికి పని కల్పించేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో గ్రామాల వారీగా పని వివరాలు, కొల తలు, కూలీల సంఖ్య తదితర వివరాలు అడిగి తెలుసు కున్నారు. సమావేశంలో కార్యక్రమంలో ఎంపీడీవో మారుతి శేషమాంబ ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మరింత షార్ప్ గా తయారవ్వాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి చిల్డ్రన్స్ క్లబ్ పేరుతో స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో పిల్లలకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహించడం అభినందనీయమని విశ్రాంత సైనిక ఉద్యోగి గోపాలం సాంబశివరావు అన్నారు. ఈ శిబి రంలో నీతి కథలతో పాటు డ్రాయింగ్, సైన్స్‌కు సంబం ధించిన విషయాలను నేర్చుకుని విద్యార్థులు మరింత షార్ప్‌గా తయారు కావాలని కోరారు. ప్రతిఒక్కరిలో ఏదో ఒక టాలెంట్ దాగి ఉంటుందని, దానిని గమనించి అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు మరో పక్క సమ్మర్ కోచింగ్ నిర్వహిస్తున్న నిర్వాహకులు వారిని తీర్చి దిద్దాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, భీమవరపు దశరధరామిరెడ్డి, సోలా ముత్యాలరావు పాల్గొన్నారు.

మధ్య విద్యా ర్థులతో కథల పుస్తకాలు చదివించడంతోపాటు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యా ర్థుల ద్వారా జూనియర్ విద్యార్థులకు ఇగ్లీషు నేర్పించారు.

వేసవి శిబిరంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పుస్తక పఠనం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుందని ప్రత్తిపాడు గ్రంథాలయాధికారి అరుణ అన్నారు. విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని శాఖ గ్రంథాలయంలో సోమవారం ఉదయం 8-10 గంటల

విద్యార్థుల భవిష్యత్తుకు గ్రంథాలయాలు దోహదం

ప్రజాశక్తి-పెదనందిపాడు

విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగ పడతాయని ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహన రావు పేర్కొన్నారు. శాఖా గ్రంథాలయం, పెదనందిపాడు నందు గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు మోహనరావు సోమవారం సందర్శించారు. సమావేశానికి గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని అధ్యక్షత వహించారు. కథలు, కథనాలు, సృజనాత్మక కృత్యాలు నిర్వహించడంతో విద్యార్థులలో నైతిక విలువలు పెరుగుతాయని, సృజనాత్మకత పెరుగు తుందని అన్నారు. నీతి కథలు, అభినయ గేయాలు, చిత్ర లేఖనం అంశాలపై విద్యార్థులు తర్ఫీదు పొందారు.

రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు

ఈస్ట్ గోదావరికి ప్రథమ బహుమతి

ప్రథమ బహుమతి జట్టు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలో గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం ఏఈఎల్‌సి చర్చి ప్రతిష్ట సందర్భంగా యూనివర్సల్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలోఈ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి ఈస్ట్ గోదావరి జట్టు సాధించగా వారికి రూ. 30 వేలను తిక్కిరెడ్డి పాలెం గ్రామ సర్పంచ్ మాకినేని జగన్‌మోహన్ రావు అందజేశారు. రెండో బహుమతిని సాధించిన కృష్ణా జిల్లాకు జట్టుకు రూ.25 వేలను మామిడి అశోక్, మూడో బహుమతిని సాధించిన వెస్ట్ గోదావరి జట్టుకు రూ.20,000ను డాక్టర్ మణిపాటి శ్రీకాంత్, నాల్గో బహుమతిని సాధించిన ప్రకాశం జిల్లా జట్టుకు రూ.15,000ను జొన్నకూటి సుబ్బారావు,జల్ది మోహన్, ఐదవ బహుమతిని గెలుపొందిన గుంటూరు జిల్లా జట్టుకు రూ.10,000 ను మామిడి జోషి బాబు, నేలపాటి క్రాంతికుమార్, ఆరో బహుమతి గెలు పొందిన తిక్కిరెడ్డిపాలెం జట్టుకు రూ.5000 ను రావూరి సాంబశివరావు అందజేశారు. ఈ టోర్నమెంట్ కు సహకరించిన దాతలకు కమిటీ సభ్యులు పవన్ కుమార్, విటల్ ప్రవీణ్ ,మామిడి సురేష్ లు తమ కృతజ్ఞతలు తెలిపారు.

ద్వితీయ బహుమతి జట్టు

ఖిద్మత్ టీమ్..మానవత్వం

అనాథ వృద్ధునికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - మంగళగిరి

నగరానికి చెందిన ఖిద్మత్ టీమ్ సభ్యులు మరోమారు తమ మానవత్వం చాటుకున్నారు. మంగళగిరి -తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నులకపేట కు చెందిన వృద్ధుడు కంచు నారాయణరావు (83) సోమవారం మృతి చెందారు. నారాయణరావుకు బంధువులు ఎవరూ లేకపోవడంతో, ఆయన మృతి చెందిన సమాచారాన్ని స్థానికులు ఖిద్మత్ టీమ్ సభ్యులకు అందించారు. దీంతో ఆ టీమ్ సభ్యులు నులకపేట చేరుకుని, సొంత ఖర్చులతో మృతుని సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా,గత ఏడాది క్రితం నారాయణరావు భార్య కాశమ్మ మృతి చెందగా ఖిద్మత్ టీమ్ సభ్యులే అంత్యక్రియలు నిర్వహించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి:డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని 4వ వార్డు ఎస్.టి కాలనీలో డివైఎఫ్ఐ విస్తృత సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సంధర్భంగా డివైఎఫ్ఐ నాయకులు ఎస్.గణేష్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీలు నిరుద్యోగులను గాలికి వదిలేశారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయడం లేదని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చలం నరసింహులు, తుమ్మా కాట్రాజు ఎన్నికయ్యారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలాజి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎం.దయాసాగర్, తదితరులు

వైసిపి నాయకులు విజయబాబు మృతి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని తూర్పు పాలేనికి చెందిన వైసిపి నాయకులు కారసాల విజయబాబు (52) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదరావు, నాయకులు మేకతోటి దయాసాగర్ సందర్శించి నివాళులర్పించారు. టిడిపి ఆవిర్భావం నుండి ఆ పార్టీలో ఉన్న ఆయన పలు స్థాయిల్లో పని చేశారు. గుంటూరు మిర్చియార్డు డైరెక్టర్‌గానూ పని చేశారు. 2019 ఎన్నికలకు ముందు వైసిపిలో చేరి క్రియాశీలకంగా పని చేశారు. నివాళులర్పించిన వారిలో వైసిపి నాయకులు యు.మురళి, వి.లక్ష్మారెడ్డి, బి.సాయి, డి.చెంచు రామారావు తదితరులు ఉన్నారు.

ఎస్‌బి డిఎస్‌పిగా సుభాష్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్పెషల్ బ్రాంచి డిఎస్‌పి గా ఎ.సుభాష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పార్వతీపురం నుంచి బదిలీపై గుంటూరు వచ్చారు. 2019లో ఆయన గ్రూపు -1 అధికారిగాఎంపిక అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

సివిల్స్‌లో రాజ్యాంగం ముఖ్యమైన అంశం

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి -గుంటూరు

సివిల్ సర్వీస్, గ్రూప్-1, గ్రూప్-2 వంటి పోటీ పరీక్షల్లో భారత రాజ్యాంగం యొక్క ముఖ్య లక్షణాలు సిలబస్‌లో భాగంగా ఉంటాయని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, కెవిఆర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరుగుతున్న ఐఎఎస్ ఫౌండేషన్ క్లాసులలో భారత రాజ్యాంగం గురించి వివరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగం రూపొందటం, రాజ్యాంగం ప్రాధమిక అంశాల గురించి వివరించారు. రాజ్యాంగంలో ప్రాధమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రాధమిక విధులు, ఉంటాయని తెలిపారు. న్యాయవ్యవస్థ పౌరుల ప్రాధమిక హక్కులు కాపాడుతుందని చెప్పారు. భారత రాజ్యాంగంలో ప్రపంచంలో ఉన్నత రాజ్యాంగంగా కొనసాగుతుందన్నారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ మెయిన్స్ పరీక్షల్లో కూడా రాజ్యాంగంపై ప్రశ్నలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో సాయి, బాలు, అజయ్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములు వారికే చెందాలి : వ్యకాస

ప్రజాశక్తి - నరసరావుపేట

గురజాల పంచాయతీ పరిధిలో దళితులు అనుభవిస్తున్న అసైన్మెంట్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారుల దౌర్జన్యాలను అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గురజాల రెవెన్యూలోని సర్వే నంబర్ 1720 -1లో ఏడు దళిత కుటుంబాలకు చెందిన 3.76 సెంట్ల అసైన్మెంట్ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు పులిగుజ్జు రవికిరణ్, కత్తి అశోక్, కొమ్ము యేసయ్య, పొట్టే పోగు కనకయ్య, కొమ్ము రవి, కొమ్మురాజు తదితరులు మాట్లాడుతూ తమ తాతల కాలం నుండి ఈ భూములను అనుభవిస్తున్నామని, ఈ భూములలో పండుతున్న గడ్డి ఆధారంగా పాడి పశువులు పెంచుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. ఈ భూములకు సంబంధించి తమ తాత తండ్రుల పేర్లతో బీ ఫారం పట్టాలు, శిస్తు రసీదులు, 10-1 అడంగుల్లో తాతల పేర్లు రాసి ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఇటీవల గురజాల గ్రామం నగర పంచాయతీగా మారిన తర్వాత, తమ భూముల చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా పెరిగిపోయిందని, ఇక్కడ ఉన్న జిల్లా పరిషత్ భూములు కూడా కబ్జా చేశారన్నారు. వారు నిర్మించిన అపార్ట్మెంట్లు, వెంచర్లలో ఉన్న మురుగునీటిని మొత్తం తమ భూముల్లో పంపింగ్ చేస్తున్నారని, దాని ఫలితంగా మురుగునీటిలో పశువులు పొర్లాడి మా భూములు నాశనం అవుతున్నాయని వాపోయారన్నారు. తాము గడ్డి పెంచుకోవడానికి వీలు లేకుండా ఆటంకపరుస్తున్నారని, ఇదేమని అడిగితే అసలు మీకు భూములు ఎక్కడున్నాయంటూ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దౌర్జన్యానికి దిగుతున్నారని దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ భూములకు తమ పేర డీకే పట్టాలు ఇవ్వాలని గ్రీవెన్స్ లోనూ, రెవెన్యూ అధికారులకు అర్జీలు పెట్టుకోగా ఈ భూముల ఆర్ఎస్సార్‌లో స్మశానంగా నమోదయి ఉన్నాయని, అందువల్ల ల్యాండ్ కన్వర్షన్ చేసి మాకు పట్టాలిస్తామని తొలుత హామీ ఇచ్చారన్నారు. వాస్తవానికి ఈ భూముల ప్రక్కన ముస్లిం స్మశాన వాటిక ఉందని దాని చుట్టూ గోడ నిర్మించి వేరు చేశారని ముస్లిం స్మశాన వాటికకు ఈ భూములకు ఎటువంటి సంబంధం లేదన్నారు.ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతు దళిత రైతులకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిన అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఒత్తిడికి లొంగి పట్టాలు ఇవ్వకపోగా, ఈ భూముల్లోకి వెళితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని, దళిత రైతులకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూకబ్జాలకు తోడ్పడటం శోచనీయమని, జిల్లాలో అనేకచోట్ల ఈ విధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు దళితులకు చెందిన భూములను కబ్జా చేయడానికి అనేక కుట్రలు చేస్తున్నారని, దీన్ని ఎదుర్కోటానికి దళితులు భూమిలేని పేదలంతా ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లాలోని వేలాది మంది దళితులకు చెందిన ఎస్సైన్మెంట్ భూములకు సరైన డీకే పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వకుండా కుంటి సాకులతో భూముల నుంచి వెళ్లగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూముల రీ సర్వే సందర్భంగా వాస్తవాలను నమోదు చేసి అవసరమైన చోట్ల ల్యాండ్ కన్వర్షన్ చేసి దళితులు భూమిలేని పేదల చేతుల్లో ఉన్న భూములకు పట్టాహక్కులు ఇచ్చి, వారి అనుభవ హక్కులను కాపాడాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆ విధంగా స్పందించకపోతే నియోజకవర్గస్థాయిలో భూసదస్సు జరిపి, పేదలందరినీ ఏకం చేసి, ప్రభుత్వ విధానాలపై పేదలకు న్యాయం జరిగే దాకా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు

అధికారులతో కలెక్టర్ పర్యావరణ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి-గుంటూరు

పర్యావరణ పరిరక్షణకు దినచర్యలలో సాధ్యమైనన్ని మార్పులు చేసుకుంటాను..నేను అనునిత్యం నా కుటుంబాన్ని, స్నేహితులను, ఇతరులను పర్యావరణ సహిత అలవాట్లు అలవరచుకునే దిశగా ప్రేరేపిస్తానని.. దానికి కట్టుబడి వుంటానని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సోమవారం కలక్టరేట్‌లో అటవీశాఖ అధికారులచే నిర్వహించబడుచున్న ' మిషన్ లైఫ్ ' అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా పర్యవరణ పరిరక్షణ కొరకు జీవన శైలి మార్పునకు అటవీ శాఖ జిల్లాలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. విద్యుచ్ఛక్తి వినియోగం, నీటి సంరక్షణ, సింగల్ యూజ్ ప్లాస్టిక్, తణధాన్యాల వినియోగం వంటి ఏడు సారాంశాలతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు జూన్ 4వ తేది వరకు నిర్వహించాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. జూన్ 5 వ తేది నాడు ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ కొరకై జీవన శైలి ప్రతిజ్ఞను జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి తో కలసి అధికారులతో చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే. చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, ఫారెస్ట్ రేంజ్ అధికారిణి డి. శ్రీవిద్య, ఫారెస్ట్ రెంజే అధికారి ఏ. వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

జగనన్నకు చెబుదాం స్పందనకు 132 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

'జగనన్నకు చెబుదాం', స్పందన కార్యక్రమాల ద్వారా ప్రజల నుండి అందిన ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి, హేతుబద్దంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జేసీ జి.రాజకుమారి, డిఆర్ఓ కె.చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలితా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 132 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపు నాణ్యతగా, గుణాత్మకంగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు ప్రతి రోజు ఉదయం పనివేళల్లో ఇక గంట సేపు వారికి అందిన ఫిర్యాదులపై దృష్టిసారించి వాటిని హేతుబద్దంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, డిఈఓ శైలజ, పంచాయతీరాజ్ ఎస్.ఇ గుర్రం బ్రహ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

9 గంటలకు జిఎంసి స్పందన

- నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు: వేసవి దష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా వచ్చే సోమవారం నుండి స్పందనను ఉదయం 9 గంటల నుండి నిర్వహిస్తామని, ఉదయం 8.30 గంటల నుండి రిజిస్ట్రేషన్ జరుగుతుందని చెప్పారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు.సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో స్పందన నిర్వహించారు. కమిషనర్ తొలుత జగనన్నకు చెబుదాం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పై అధికారులతో, సంబంధిత సిబ్బందితో సమీక్షించి, ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం 13, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 3, ఉపాసెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగంకు 4, మొత్తం 34 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ భానుప్రకాష్, ఏడిహెచ్ రామారావు, బయాలజిస్ట్ మధుసూదన్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛను కోసం వికలాంగురాలి ఆవేదన

పెన్షన్ ఇప్పించాలని ఓ దివ్యాంగురాలు పదే పదే అధికారుల చుట్టూ తిరుగుతున్నా స్పందించట్లేదు. గుంటూరు నగరం, మంగళదాస్ నగర్‌కు చెందిన యను మల కనకదుర్గకు 14 ఏళ్ల వయస్సు ఉంటుంది. ఈ బాలికకు రెండు కళ్లూ కనిపించట్లేదు. రెండు చేతులకూ వేళ్లు కూడా లేకపోవటంతో బయోమెట్రిక్ పడట్లేదు. దీంతో పెన్షన్ ఇచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. ఉన్నతాధికారులు స్పందించి తనకు పెన్షన్ ఇప్పించాలని కోరింది.

భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని వినతి

బిసి భవనం నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఈ మేరకు సంఘం నాయకులు కలెక్టర్‌కు స్పందనలో అర్జీ అందచేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో బిసి భవన నిర్మాణానికి ప్రతి జిల్లాకు రూ.5 కోట్లు ఖర్చు చేయటానికి ప్రభుత్వం 2016లో ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ మేరకు గుంటూరు మండలంలోని అంకిరెడ్డిపాలెంలో వేర్వేరు సర్వే నంబర్లలో 0.77 సెంట్లు, 0.63 సెంట్లు కేటాయిస్తూ 2018లో గుంటూరు తహశీల్దార్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటి వరకూ భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదని తెలిపారు. ఆ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు త్వరితగతిన కేటాయించి, బిసి భవనం నిర్మాణం 2023 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో బిసి సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర ట్రెజరర్ కన్న మాస్టార్, బిసి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు నిమ్మల శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

నా స్థలాన్ని ఎంపిడిఒ ఆక్రమించారు..

ఆక్రమణకు గురైన తన స్థలాన్ని తనకు ఇప్పించాలని వెంకటకృష్ణ అనే వ్యక్తి స్పందనలో ఫిర్యాదు చేశారు. 2004లో చలపతి స్కూల్లో టీచర్‌గా పనిచేసుండగా, అమరావతి రోడ్డు ఫేస్‌లో 314 గజాలు సైట్ కొనుకున్నానని, నిర్మాణానికి డబ్బులు కావాలని 180 గజాలు గోరంట్లకు చెందిన వ్యక్తికి అమ్ముకున్నానని, వ్యాపార రీత్యా గత 20 ఏళ్ళ నుండి బెంగుళూరులో ఉంటున్నానని తెలిపారు. మిగిలిన స్థలంలో ఇటీవల ఫిబ్రవరిలో వచ్చి కాంపౌండ్ వాల్ కట్టి, షెడ్డు వేసుకున్నానని, వారం రోజులు హైదరాబాద్‌లో తన కుమారుడి వద్దకు వెళ్లి వచ్చేలోగా ఆక్రమించారన్నారు. తన స్థలంలో ఉన్న వారిని వెళ్లి అడిగితే తనపై అట్రాసిటీ కేసు పెడతానని బెదిరించారన్నారు. సైటు నాదేనని డాక్కుమెంట్లు చూపించానని, ఆక్రమించిన వారు డాక్యుమెంట్లు కూడా చూపించలేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశానని, సిసిఎస్ డిఎస్‌పి ఆదేశాల మేరకు తహశీల్దారు సర్వే చేశారన్నారు. ఆక్రమించిన ఎంపిడిఒ శ్రీనివాస పద్మాకర్ డాక్యుమెంట్‌లో సర్వే నెంబర్ 290/1ఎ అని ఉందని, తన సైట్ తన డాక్యుమెంట్‌లో 298/3 అని ఉందని, ఈ స్థలం వెంకటకృష్ణదేనని అధికారులు రిపోర్ట్ ఇచ్చారన్నారు. ఆక్రమణదారులపై తాడికొండ పిఎస్‌లో ఫిర్యాదు చేశానన్నారు. అయినా స్థలం ఖాళీ చేయకుండా కోర్టులో చూసుకుందాం అని పద్మాకర్ అంటున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని కోరారు.